క్లుప్తంగా

యువత ఓటర్లుగా నమోదు కావాలి

చింతలపూడి: అర్హత గల యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కృష్ణజ్యోతి కోరారు. పట్టణంలో బుధవారం ఓటర్ల నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటుకు ఉన్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్ల నమోదుపై అవగాహన కలిగించడానికి రాజకీయ నాయకులు, ట్రాన్స్ జెండర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వీఆర్వోలు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని వేగవరంలో జనభాగీదారి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ల పంపిణీ


పెన్షన్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పెరిగిన పెన్షన్ వల్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ సంక్రాంతి వేడుకలను సంతోషంగా నిర్వహించుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు కంచర్ల సత్యనారాయణ, కుర్రు నాగబాబు, ఎంపీటీసీ కొండేపాడు చింతయ్య తెలిపారు. బుధవారం గంగవరం గ్రామ సచివాలయం వద్ద జరిగిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో 16 మందికి నూతన పెన్షన్‌లను పెరిగిన సొమ్ముతో కలిపి మొత్తం మూడు వేల రూపాయలను పంపిణీ చేశారు.

అంబేడ్కర్ స్మృతి వనంతో పర్యాటకాభివృద్ధి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: విజయవాడలో అత్యంత సుందరంగా ప్రభుత్వం నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం దేశంలోనే ప్రసిద్ధి గాంచిన పర్యాటక ప్రదేశంగా మారబోతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని దుద్దుకూరు క్యాంప్ కార్యాలయంలో అంబేడ్కర్ స్మృతి వనం ఆహ్వాన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవం జరుగుతుందని చెప్పారు. అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఎంపీపీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో యువతకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


బుట్టాయగూడెం: హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: యువతను ప్రోత్సహించటానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా క్రీడాకారులను తయారు చేసి మంచి స్పోర్ట్స్ మెన్స్‌గా తీర్చిదిద్దాలని సీఎం జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అలాగే క్రీడా పతాకాన్ని ఎంపీపీ కారం శాంతి ఎగుర వేశారు. క్రీడా జ్యోతిని బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కాసేపు ఆడారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.శారాశాంతి, ఈఓపీఆర్డీ ఎం.శ్రీహరి, ఎంపీటీసీ తెల్లం రమణ, జీసీసీ రాష్ట్ర డైరెక్టర్ తెల్లం చిన్నారావు, సర్పంచ్‌లు తెల్లం వెంకటలక్ష్మి, మడకం రామలక్ష్మి, కుంజా వెంకటేశ్వరరావు, జోడే సత్య దుర్గాప్రసాద్, ఉయికే బొజ్జి, ఎంపీటీసీ గాలి దుర్గారావు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం మండలంలో..

పోలవరం రూరల్: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి మండల స్థాయి పోటీలను పోలవరం ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీనులు ప్రారంభించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

చింతలపూడి: చదువుతో పాటు విద్యార్థు క్రీడల్లోనూ రాణించి దేశానికి పేరు తీసుకురావాలని ఎంపీడీఓ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. చింతలపూడి ప్రభుత్వ బాలుర హైస్కూల్ గ్రౌండ్, ప్రగడవరం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం 'ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. షటిల్, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆటల పోటీల వల్ల క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం నేరుగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని రూపొందించి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: యువతను ఆటల వైపు మళ్లించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని రూపొందించారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి తెలిపారు. జంగారెడ్డిగూడెంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్‌లు ఎల్.వెంకటేశ్వరరావు, ఉగ్గం ప్రసాద్, మేక రమాదేవి, కో-ఆప్షన్ వెంజ ఐజీ, నాయకులు బత్తిన చిన్న, గెద్దాడ శ్రీను, చిప్పాడ వెంకన్న, పంది రాజా, ద్వారకాతిరుమల దేవస్థానం డైరెక్టర్ వాసా రామకృష్ణ, చేనేత విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్ భావన రుషి, మహ్మద్ హాఫీజ్, తల్లాడ శ్రీను, పెసరగంటి త్రిమూర్తులు, నేత్రు గణేష్, దున్న బుజ్జి,తల్లాడ హరి, కంచర్ల విష్ణు, కాసర సోమిరెడ్డి, షేక్ అమీర్, నౌడు అశోక్, తమ్మిశెట్టి సాయినాధ్, లింగంగుంట శ్రీను, దోనేపూడి రమణ, మల్లవరపు నాగపోసు, చక్రధరరావు, పరశురాం మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

లిగంపాలెం: గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాణించాలని ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి కోరారు. బుధవారం లింగపాలెం మండలం శింగగూడెం హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రంలో భాగంగా మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీపీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ మట్టా సురేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తగరం హేమలత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముసునూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.


పోలవరం రూరల్: పోలవరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ బి.సుమతి


చింతలపూడి: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


జంగారెడ్డిగూడెం: జెడ్పీ హైస్కూల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి, జెడ్పీటీసీ బాబ్జి


లిగంపాలెం: శింగగూడెం హైస్కూల్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

జంగారెడ్డిగూడెంలో ఆపరేషన్ స్వేచ్ఛ

జంగారెడ్డిగూడెం: బాలబాలికలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అటువంటి నేరాలకు పాల్పడిన వారు శిక్షార్హులని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో మండల న్యాయ సేవాధికార సంస్థ, లేబర్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యాన ఆపరేషన్ స్వేచ్ఛ 2024 కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలను తనిఖీ చేసి 14 సంవత్సరాలలోపు బాలబాలికలను పనుల్లో పెట్టుకోవడం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. ఏలూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జీవీ రమణ ఉద్యోగుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఏవీవీ భువనేశ్వరి, న్యాయవాదులు సీహెచ్ డీవీ కోటేశ్వరరావు, మాదేపల్లి క్రాంతి కుమార్, మనెల్లి గంగరాజు, ఏఎస్సై మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు కొయ్యలగూడెంలో ముగ్గుల పోటీలు

కొయ్యలగూడెం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈనెల 12వ తేదీ శుక్రవారం కొయ్యలగూడెం వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్వహించే ఈ పోటీలలో రూ.25 వేలు విలువైన బహుమతులను విజేతలకు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో వైరు చోరీ

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని నాగులగూడెంలో గోలి వెంకటరత్నంకు చెందిన పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. స్తంభంపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు నెట్టివేసి పగులగొట్టారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న రాగి వైరును దొంగిలించుకుపోయారు. చోరీ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. చోరీకి గురైన వైరు విలువ సుమారు రూ.70 వేలు వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలను అరికట్టాలి

కామవరపుకోట: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, గుండాట నిర్వహించకుండా అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ డీవీ సత్యనారాయణ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. పండుగ సమయంలో కోడిపందేలు, గుండాట వంటి జూదం ఆటడం వల్ల కుటుంబాలు ఆర్థికంగా విచ్ఛిన్నం అవుతాయని, ప్రజలు జూదం వీడి, క్రీడలను ప్రోత్సహించేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముందస్తుగా సమస్యాత్మకంగా ఉన్న 75 మందిని గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని పోలింగ్ స్టేషన్‌లను తహసీల్దార్ బి.సుమతి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు మండలంలోని 252, 255, 260, 283, 261 పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా అనేది పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్ వద్ద ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం తదితర వసతులను పరిశీలించినట్లు చెప్పారు.

పోలవరం సీఐగా జి.మధుబాబు

పోలవరం రూరల్: పోలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.మధుబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజమండ్రి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. పోలవరం స్టేషన్ వద్ద ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


కామవరపుకోట: ద్వారకాతిరుమలలోని విర్డ్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శిరీష


కొయ్యలగూడెం: కోనసీమ జిల్లా రావులపాలెం వెళ్లి పద్మశ్రీకి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ చిట్టిబాబు

కామవరపుకోట: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి సకాలంలో పింఛన్ అందజేసి అండగా నిలిచింది ఓ గ్రామ వలంటీర్. ద్వారకాతిరుమల విర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు కలిదిండి లక్ష్మీనరసమ్మకు కామవరపుకోట గ్రామ సచివాలయ వలంటీర్ శివనాగుల శిరీష ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. వృద్ధురాలు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

80 కిలో మీటర్ల వెళ్లి..

కొయ్యలగూడెం: కోనసీమ జిల్లా రావులపాలెం వెళ్లి పెన్షన్ లబ్ధిదారైన టి.పద్మశ్రీకి వలంటీర్ చిట్టిబాబు పింఛన్ అందజేశాడు. పరింపూడి-3 సచివాలయ పరిధిలోని పద్మశ్రీకి ఆపరేషన్ జరగడంతో కుమార్తె ఇంటి వద్ద చికిత్స పొందుతోంది. దీంతో విషయం తెలుసుకున్న వలంటీర్ బుధవారం రావులపాలెం వెళ్లి పెన్షన్‌ను అందజేశాడు.

3, 4 తేదీల్లో విర్డ్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో వచ్చేనెల 3, 4 తేదీల్లో ప్రత్యేక ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని, అలాగే కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నట్టు ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. శిబిరంలో హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై, ముంబై నగరాలకు చెందిన జాతీయ స్థాయి ప్రముఖ వైద్యులు రోగులకు మోకాలు, తుంటి సమస్యలకు చికిత్సలు అందిస్తారన్నారు. మోకాలు, తుంటికి సంబంధించి ఇన్వెక్టెడ్, రివిజన్ శస్త్ర చికిత్సలను చేస్తారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా తుంటి ఆపరేషన్లను నిర్వహిస్తారన్నారు. ఈ వైద్యసేవలను పొందేవారు స్క్రీనింగ్, చికిత్స నిమిత్తం తమ వద్ద ఉన్న రిపోర్టులను తీసుకువచ్చి ఆస్పత్రిలో ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 85002 63149, 79016 95176 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం అని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలోని చంద్రశేఖర మినీ ఫంక్షన్ హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వమే అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా పేదవాడికి అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్‌లు ఎల్.వెంకటేశ్వరరావు, ఉగ్గం ప్రసాద్, మేక రమాదేవి, కో-ఆప్షన్ వెంజ ఐజీ, నాయకులు బత్తిన చిన్న, గెద్దాడ శ్రీను, చిప్పాడ వెంకన్న, పంది రాజా, ద్వారకాతిరుమల దేవస్థానం డైరెక్టర్ వాసా రామకృష్ణ, చేనేత విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్ భావన రుషి, మహ్మద్ హాఫీజ్, తల్లాడ శ్రీను, పెసరగంటి త్రిమూర్తులు, నేత్రు గణేష్, దున్న బుజ్జి,తల్లాడ హరి, కంచర్ల విష్ణు, కాసర సోమిరెడ్డి, షేక్ అమీర్, నౌడు అశోక్, తమ్మిశెట్టి సాయినాధ్, లింగంగుంట శ్రీను, దోనేపూడి రమణ, మల్లవరపు నాగపోసు, చక్రధరరావు, పరశురాం మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ ఎ.రాము

టి.నరసాపురం: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టాలని జిల్లా డ్వామా పీడీ ఎ.రాము సూచించారు. టి.నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మంగా కుమారి అధ్యక్షతన బుధవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. మస్టర్ షీట్‌లు, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. తొలుత జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మితో కలిసి పీడీ రాము సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి గానూ ఉపాధి హామీ పథకంలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.9.93 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 9 వరకు సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు చేసిందని, తనిఖీల్లో అవకతవకలు గుర్తించినట్లు చెప్పారు. రూ.22,570 మేర అక్రమాలు జరిగినట్లు తేలగా బాధ్యుల నుంచి రికవరీకి ఆదేశించామన్నారు. రికార్డు నిర్వహణ లోపం కారణంగా రూ.4,500 తేడా గుర్తించామని, అలసత్వం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఫైన్ విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కోసం ఎమ్మెల్యే బాలరాజుకు వినతి


దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి, గ్రామస్తులు

బుట్టాయగూడెం/పోలవరం రూరల్: పోలవరం మండలంలోని చేగొండపల్లి పంచాయతీలో గల ఉడతపల్లి, మెత్తప్పకోట గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేలా కృషి చేయాలని కోరుతూ పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆధ్వర్యాన గ్రామస్తులు బుధవారం బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులు చెపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉడతపల్లి, మెత్తప్పకోటకు చెందిన గ్రామస్తులు పాల్గొన్నారు.

జూదం ఆడితే కఠిన చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ ధనుంజయుడు

చింతలపూడి: సంక్రాంతి పండుగా రోజుల్లో సాంప్రదాయ క్రీడల పేరిట గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజేయుడు హెచ్చరించారు. బుధవారం చింతలపూడి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు, సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైనా జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డబ్బుకు ఆశ పడి జూదం అనే వ్యసనానికి అలవాటు పడితే వారి జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించమని తెలిపారు. కోడి పందేలు, కోడి కత్తులు తయారీదారులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు, వారిపై గట్టి నిఘా ఉంచినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో 625 బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. కోడిపందేలు, జూదం వలన ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసి వారి ధనాన్ని నష్టపోతున్నారన్నారు. గతంలో కోడిపందేలు, పేకాట, నిర్వహించిన ప్రదేశాలు, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్వరరావు, ఎస్సై ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన హ్యూమన్ రైట్స్ మిషన్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం హ్యూమన్ రైట్స్ మిషన్ సభ్యులు బుధవారం డీఎస్పీ ధనుంజయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ కమిషన్ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలను అభినందించడంతో పాటు సంస్థ చేసే మంచి పనులకు తన సహాయసహకారాలు ఉంటాయని తెలిపారు. కమిషన్ సభ్యులు డీఎస్పీని సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, సభ్యులు హనుమంతరావు, ఎల్ఆర్ కృష్ణబాబు, సత్యనారాయణ, అన్నపూర్ణాదేవి, త్రిపుర రమేష్, రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం


జంగారెడ్డిగూడెం: ముగ్గులను తిలకిస్తున్న సినీ గేయ రచయిత అనంత్ శ్రీరామ్


కొయ్యలగూడెం: రేపల్లెవాడలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

జంగారెడ్డిగూడెం: సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ అన్నారు. తపన ఫౌండేషన్ సహకారంతో జేఆర్‌జీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఆధ్వర్యాన జంగారెడ్డిగూడెం రాములమ్మ చెలకలో సంక్రాంతి సంబరాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. సంబరాలను చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, కౌన్సిలర్‌లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: సంక్రాంతి వేడుకలను మండలంలోని పలు విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. రేపల్లెవాడ గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల వివిధ వేషధారణల్లో అలరించారు.